సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 7 । మే । 2025



జాగ్రత్తలతో .. వేసవి టూర్ హ్యాపీ

వేసవి సెలవుల్లో విహార యాత్రలు చిన్నపాటి జాగ్రత్తలతో.. ఆనందంగా ముగించవచ్చు. లేనిపక్షంలో కొన్ని ఇబ్బందులు ఎదురవ వచ్చు. -8లో



సోలార్ నిర్వాసితులకు న్యాయం

గాలివీడు మండలంలోని తూముకుంట సోలార్ నిర్వాసితులకు సముచిత న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.90
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 492 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మదనపల్లెలో సీఐడీ అధికారులు

మదనపల్లె: మండల తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం సీఐడీ అధికారులు వచ్చారు. మదనపల్లె ఫైల్స్ కేసుకు సంబంధించి దర్యాప్తులో భాగంగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సీఐడీ డీఎస్పీ పద్మలత... తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ భరత్‌తో మాట్లాడారు. వలసపల్లె పంచాయతీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి వివరాలు కోరితే.. ఇప్పటి వరకు ఇవ్వకపోవడంపై ప్రశ్నించారు. అలాగే ఇతర రిపోర్ట్‌లు ఆలస్యం చేస్తున్నారని, కేసు దర్యాప్తులో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి వివరాలు ఇవ్వడంతో పాటు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తు పత్రాలను ఇవ్వాల్సిందిగా కోరారు.

కడప రిమ్స్ ప్రిన్సిపాల్ బదిలీ

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఏ.సురేఖ నంద్యాల ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. 2022 అక్టోబర్‌లో పూర్తి అదనపు బాధ్యతలతో రిమ్స్ ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరిన డాక్టర్ సురేఖ తరువాత 2023 సెప్టెంబర్ నుంచి అడిషనల్ డీఎంఈ హోదాలో ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం వరకు సమర్థవంతంగా విధులను నిర్వహించారు. ఆమె స్థానంలో ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా, అడిషనల్ డీఎంఈ హోదాలో పనిచేస్తున్న డాక్టర్ టి.జమున కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

గాలివాన బీభత్సం



కాకర్లవారిపల్లిలో నేలకొరిగిన బొప్పాయి చెట్లు

ఓబులవారిపల్లె: మండలంలో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో వాన పడింది. వర్షానికి తోడు విపరీతంగా గాలులు తోడు అయ్యాయి. దీంతో కాకర్లవారిపల్లి, బోటిమీదపల్లి, రాళ్ల చెరువుపల్లి తదితర గ్రామాల్లో బొప్పాయి, అరటి చెట్లు నేలకొరిగాయి. వందలాది ఎకరాలలో పంట నష్టం వాటిల్లింది. పంట చేతికందే సమయంలో గాలులకు నేలకు ఒరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అంతంత మాత్రాన ఉన్న మామిడి కాయలు గాలులకు రాలిపోయాయి.

హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు: పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు సమర్పించుకున్న కానుకలను కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. శాశ్వత హుండీల ద్వారా రూ 6,11,462 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా సేవా టికెట్ల ద్వారా రూ 69,750లు, అన్నదానం కోసం ఇచ్చిన చందాల ద్వారా రూ 78,285 వచ్చిందని, దీంతో మొత్తం కలిపి రూ 7,59,762 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ కమీషనర్ జీ మల్లికార్జున, అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బా రెడ్డి, ఆలయ అర్చకులు అఖిల్ దీక్షితులు, పురావస్తు శాఖ, పోలీసు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు



డిక్షనరీల స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి జగదాంబ సెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా పంపిణీ చేయడానికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు జిల్లాకు చేరాయి. జిల్లాలో డిక్షనరీలు భద్రపరిచిన పాయింట్‌ను డీఈఓ సుబ్రమణ్యం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లంపై పట్టు సాధించడానికి, విద్యార్థి స్వతహాగా ఆంగ్ల పదాల అర్థాలు తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడుతాయన్నారు. జిల్లాలోని 6వ తరగతి విద్యార్థులకు అందిస్తామన్నారు. ఈ సారి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆంగ్లం– ఉర్దూ డిక్షనరీలు అందిస్తున్నట్లు తెలిపారు. 653 ఆంగ్లం– ఉర్దూ డిక్షనరీలు, 8189 ఆంగ్లం– తెలుగు డిక్షనరీలు జిల్లాకు చేరాయన్నారు. ఆయన వెంట జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి(సీఎంఓ) కరుణాకర్, ఆక్స్‌ఫర్డ్ ప్రాంతీయ మేనేజర్ వెంకటపతినాయుడు తదితరులు ఉన్నారు.

మడుగు.. కనుమరుగు!

మడుగులో మాటేశారు.. కబ్జాలతో కాటేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కొల్లగొట్టే దిశగా పావులు కదుపుతున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూమి కావడంతో.. ఎలాగైనా సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కట్టడి చేయాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తున్నారు. దీంతో మడుగు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది.

- కమ్మగా చక్రాలమడుగు కబ్జా
- అధికారమే అండగా ఆక్రమణలు
- రూ.కోట్ల విలువైన స్థలాల్లో నిర్మాణాలు
- ప్రేక్షక పాత్రలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



ఆక్రమణలతో మడుగు చదును ఇలా..

రాజంపేట: రాజంపేట పట్టణ నడిబొడ్డున చక్రాల మడుగు ఉంది. పుల్లంపేట ప్రాంతంలోని పుల్లంగేరు నుంచి వచ్చే వరదనీరు కిలోమీటర్ల మేర ప్రవహించి.. ఈ మడుగులో కలుస్తుంది. ఇక్కడి నుంచే అనేక ఆయకట్టు భూములకు నీరందుతుంది. మిగిలిన నీరు చెరువులు, దిగవున చెయ్యేరులోకి వెళుతుంది. పుల్లంగేరు ప్రవాహానికి చక్రాలమడుగు అనధికార రిజ్వరాయర్‌గా మారింది. రాజంపేట పట్టణంతోపాటు పరిసర గ్రామాల భూగర్భజలాలు పెరగడానికి ఈ మడుగు కీలకమనే చెప్పవచ్చు. సర్వే నంబరు 961/డీ–1బీలో ఉన్న ఇది సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించింది. అధికారులు మాత్రం 6.30 ఎకరాలు మాత్రమే ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో కబ్జాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. మడుగును చాలా వరకు పూడ్చేశారు. కొందరు అడ్డగోలుగా మట్టితో నింపేస్తూ.. అనధికార నిర్మాణాలు చేపడుతున్నారు. కూటమి పాలన ఏడాది కాకముందే కబ్జాల బాగోతం ఎక్కువైంది.

ఎన్టీఆర్ కూడలి నుంచి..

ఎన్టీఆర్ కూడలి నుంచి కడప వైపు సుమారు 200 మీటర్ల దూరం మడుగు వెంట నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్ని చోట్ల రివిట్‌మెంట్ మట్టి కిందికి తొక్కేసి మరీ కట్టేస్తున్నారు. మరికొన్ని చోట్ల పూడ్చివేత ప్రక్రియ సాగుతోంది. ఇక్కడ సెంటుభూమి విలువ రూ.10 లక్షలపై మాటే. ఆక్రమిత భూమి విలువ రూ.కోట్లలోనే పలుకుతోంది. కడప–తిరుపతి జాతీయ రహదారి బైపాస్‌ను ఆనుకుని ఉన్న స్థలం కావడంతో పరిస్థితి కీలకంగా మారింది. ఇక్కడే కొందరు ఏకంగా మడుగు ఓ వైపు గోడ నిర్మించడం గమనార్హం. మరికొందరు కంచె వేసుకొని మరీ కబ్జాల పర్వ కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఏకంగా వంతెనకే ఎసరు పెట్టేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నెల్లూరు వైపు రోడ్డులో మడుగు వంతెన..

రాజంపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లే రోడ్డు పక్కన మడుగు వద్ద ఓ వంతెన ఏళ్ల కిందట నిర్మించారు. ఈ వంతెన ఇక్కడ మడుగు ఎంతుందన్న వివరాలను స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ వంతెనకూ ఎసరు పెట్టేస్తుండటంతో ఇబ్బందికరంగా మారింది.

నేతల మాటలు ఒకలా.. చేతలు మరోలా..

చక్రాలమడుగు ఆక్రమణల పర్వంలో ప్రధానంగా కమ్మగా కబ్జాలను చేపట్టారు. పచ్చనేతల స్వార్థం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. వాగులు, వంకలు ఎట్టి పరిస్థితుల్లో నాశనం చేయకూడదన్న నిబంధనకు.. రాజంపేట రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు నీళ్లు వదిలారు. సంరక్షించాల్సిన శాఖలే చేతులెత్తేశాయి. ఈ మడుగును ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని అధికార పార్టీ నేతలు ప్రగల్భాలు పలుకుతారు. కబ్జాలు మాత్రం కొనసాగుతూనే ఉంటాయి. ఇప్పుడు మడుగే లేకుండా పోతుండటంతో సమస్య ఏర్పడింది.

సర్వేతో బహిర్గతం

గతంలో ఆర్డీవోగా వున్న పద్మజ మడుగు కబ్జాలపై దృష్టి సారించారు. ఆక్రమణలను నిగ్గు తేల్చే దిశగా అన్ని శాఖలతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ నేపథ్యంలో కబ్జాల పర్వం ఆధా రాలతో సహా బయటపడింది. ఏం జరిగిందో తెలియదు కానీ, ఆ కథ కంచికి చేరిందనే విమర్శలున్నాయి. మడుగు ఆక్రమణలు పాలకులతోపాటు ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు, పట్టణ వాసులకు తెలుసు.. అయినా చర్యలేవి చేపట్టలేని దుస్థితిలో ఉన్నారు. మడుగు కబ్జా అంశం తెర పైకి తేస్తే మాములే అన్న అధికారగణం ఇప్పుడుంది. మడుగులో ఆక్రమిత నిర్మాణాల అంశాన్ని 'సాక్షి' జిల్లా కలెక్టరు చామకూరి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లింది.

మున్సిపాలిటీ అనుమతులేలా..!

మడుగులో అక్రమ నిర్మాణాలకు మున్సిపాలిటీ అన్ని అనుమతులు ఇచ్చేస్తోందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్లాన్ అప్రూవల్ ఏ విధంగా ఇస్తున్నారో తెలియడం లేదు. మడుగులో పట్టాలు ఉన్నాయని, అన్ని అనుమతులు పొందుతున్నారు. మడుగు ఆక్రమణ నిర్మాణాలకు మున్సిపాలిటీ ఏ విధంగా పంత పాడిందో అర్థం కావడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు.

రికార్డులు తారుమారు?

పాతబస్టాండుతోపాటు పరిసర ప్రాంతం కూడా మడుగు పోరంబోకు స్థలంగా చెబుతున్నారు. అగ్రవర్ణాలకు చెందిన వీఆర్వో (రిటైర్డ్) చేతివాటంతో ఇతర ప్రాంతాల సర్వే నంబర్లతో మడుగు స్థలాలను రిజిస్ట్రేషన్‌ను దర్జాగా చేసుకున్నారు. ఇప్పుడు అందరూ కూడా పట్టా ఉందని బహిరంగగానే చెప్పుకొనే స్థితికి మడుగును తీసుకొచ్చారు. రెవెన్యూలో పని చేసి రిటైర్డ్ అయిన అధికారుల వద్ద.. మండల రెవెన్యూ భూ రికార్డులు ఇప్పటికీ ఉన్నాయనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. తహసీల్దారు కార్యాలయంలో మడుగు రికార్డులు కూడా తారుమారు చేశారని, బ్రిటిషు కాలం నాటి మడుగు స్వరూపానికి సంబంధించి ఆధారాలు లేకుండా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కొంతనే మిగిలిన చక్రాలమడుగు

పొంచి ఉన్న ముప్పు

రూ.కోట్లాది విలువైన భూములు పరాధీనం కావడంతో రాజంపేటకు వరద ముప్పు కనిపిస్తోంది. పుల్లంగేరు నుంచి వరద నీటి ప్రవాహం కబ్జాలు లేనప్పుడు.. నేరుగా అత్తిరాలలో కలిసిపోయేది. మడుగును ఆక్రమించి వేయడంతో ఈ ప్రవాహం దిగువకు వెళ్లే పరిస్థితి లేక.. రాజంపేట పట్టణంపైకి దూసుకు రావడం తథ్యమని నిపుణులు అంటున్నారు. మరో బుడమేరు(విజయవాడ) అవుతుందేమోనని పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు. రానున్నది వర్షాల సీజన్.. మరి మడుగు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలియడం లేదు. పాతబస్టాండుతోపాటు మడుగు ఆనుకొని పరిసర ప్రాంతాలు జలమయంగా మారనున్నాయి.



2015లో చక్రాలమడుగులో అక్రమ నిర్మాణాలను ముంచేసిన వరద (ఫైల్)

రాయచోటి రాజకీయాల్లో

చెరగని ముద్ర

- తిరుగులేని నేతగా ఎదిగిన పాలకొండ్రాయుడు
- అభిమాన నాయకుడి మృతితో విషాద ఛాయలు

రాయచోటి: రాయచోటిలో రాజకీయాల్లో సుగవాసి పాలకొండ్రాయుడు చెరగని ముద్ర వేశారు. ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా పని చేసి.. సుదీర్ఘ రాజకీయ జీవితం కొనసాగించారు. అలాంటి అరుదైన నేత మృతితో.. రాయచోటిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు(86) మంగళవారం వేకువజామున కన్నుమూశారు. ఆయన రాయచోటిలో రాజకీయ శూన్యత నెలకొన్న సమయంలో.. అప్పటి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు, అభిమానుల పిలుపు మేరకు.. 1977లో రాజకీయ అరంగేట్రం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి రాజకీయ ప్రయాణం మొదలుపెట్టారు. నియోజకవర్గంలో బలమైన ప్రజానేతగా ఎదిగిన ఆయన ఒక పర్యాయం జనతా పార్టీ నుంచి, రెండో పర్యాయం స్వతంత్ర అభ్యర్థిగా రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత కాలంలో ఎన్‌టి రామారావు స్థాపించిన టీడీపీలోకి అడుగు పెట్టిన నాటి నుంచి.. నేటి వరకు అదే పార్టీలో సీనియర్ నేతగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సఖ్యతతో రాజకీయ ప్రస్థానం సాగింది.

- 1978లో రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ స్థానం నుంచి తొలిసారిగా జనతా పార్టీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మహల్ హబీబుల్లాపై విజయం సాధించారు.
- 1983లో రాయచోటి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మహల్ షవరున్నీసాపై జయకేతనం ఎగురవేశారు.
- టీడీపీ స్థాపన అనంతరం ఎన్టీఆర్ ఆహ్వానించడంతో సుగవాసి ఆ పార్టీలో చేరారు.
- 1984లో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఎ.సాయిప్రతాప్‌పై విజయం సాధించారు.



దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో సుగవాసి పాలకొండ్రాయుడు (ఫైల్)

- 1989లో కాంగ్రెస్ అభ్యర్థి మండిపల్లి నాగిరెడ్డిపై పోటీ చేసి తొలి ఓటమిని చవిచూశారు.
- 1991లో రాజంపేట పార్లమెంట్ స్థానానికి ఎ.సాయిప్రతాప్‌పై పోటీ చేసి ఓటమిని చవిచూశారు.
- 1992లో అప్పటి ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి అనంతరం రాయచోటి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో.. మండిపల్లి నారాయణరెడ్డిపై పోటీ చేసి ఓటమి చెందారు.
- 1994లోనూ రాయచోటి అసెంబ్లీ స్థానానికి మండిపల్లి నారాయణరెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు.
- 1999లో రాయచోటి అసెంబ్లీ నుంచి మండిపల్లి నారాయణరెడ్డిపై విజయం సాధించారు.
- 2004లో రాయచోటి నుంచి ప్రస్తుత మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరి మిన్నంరెడ్డి శ్రీలతరెడ్డిపైన విజయం సాధించారు.
- 2009లో రాయచోటి నుంచి గడికోట శ్రీకాంత్‌రెడ్డిపై పోటీ చేసి ఓటమి చవిచూశారు. తర్వాత ప్రత్యక్ష ఎన్నికలలో పోటీకి దిగలేదు. ఆయన రాజకీయ వారసులుగా కుమారులు సుగవాసి సుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబు కొనసాగుతున్నారు. 31 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో 8 దఫాలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి నాలుగు సార్లు గెలుపొందారు. రాజంపేట పార్లమెంట్ స్థానానికి రెండు దఫాలు పోటీ చేసి ఒక సారి ఎంపీగా విజయం సాధించారు.

ప్రముఖుల నివాళి

రాయచోటి: రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడుకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మంగళవారం రాయచోటిలో సుగవాసి ఇంటి ఆవరణలో ప్రజల సందర్శనార్థం పాలకొండ్రాయుడు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు ఉంచారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్టీ అబ్జర్వర్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు గడికోట మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు.



పాలకొండ్రాయుడు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

క్లుప్తంగా

తెగిపడిన విద్యుత్ తీగలు


బజారువీధిలో విద్యుత్ తీగలు తెగిపడిన దృశ్యం

గుర్రంకొండ : విద్యుత్ తీగలు తెగిపడడంతో ఒక్కసారిగా హైఓల్టేజీతో విద్యుత్ సరఫరా కారణంగా షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇళ్లలోని ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోయాయి. దీంతో రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పట్టణంలోని బజారువీధి గ్రంథాలయం పరిసరాల్లో ఒక్కసారిగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో హైఓల్టేజితో విద్యుత్ సరఫరా కావడంతో ఇళ్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్విచ్ బోర్డుల్లో పొగలు రావడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలో బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లతో పాటు ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. ఈ సంఘటనలో రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లింది.

నలుగురు కోడిపందెం నిర్వాహకుల అరెస్టు

మదనపల్లె : కోడిపందెం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మంగళవారం పట్టణంలోని గొల్లపల్లె బైపాస్‌రోడ్డు ఆర్.ఆర్.కల్యాణమండపం సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఏఎస్ఐ రమణ సిబ్బందితో కలిసి దాడిచేశారన్నారు. దాడిలో స్థానికులైన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,600 నగదు, రెండు పందెంకోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుకు ఆస్తి నష్టం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని నడిబొడ్డున ఉన్న ఓబిలి శ్రీనివాసులు రెడ్డి ఇంటిపై మంగళవారం సాయంత్రం పిడుగు పడింది. బయట ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పిడుగుపాటుకు గ్రామంలోని విద్యుత్ ఓల్టేజి పెరగడంతో ఏసీలు, ఫ్రిజ్‌లు, విద్యుత్ సామగ్రి కాలిపోయి లక్షలాది రూపాయలు ఆస్తినష్టం వాటిల్లింది.

కారు-బైకు ఢీ


మృతి చెందిన శ్రీనివాసరాజు(ఫైల్)

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలో ఊటుకూరు సమీపంలో మంగళవారం కారు, బైకు ఢీకొన్నాయి. ఊటుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు(38) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదానికి ఓవర్‌టేక్ కారణమని స్థానికులు అంటున్నారు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్మికుడి మృతి


మహదేవ (ఫైల్)

కలికిరి : ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు... విధి నిర్వహణలో భాగంగా పంచాయతీ కార్మికుడు మహదేవ(39) సోమవారం మధ్యాహ్నం ఇందిరమ్మకాలనీ సమీపంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నాడు. అక్కడ ప్రమాదవశాత్తు ట్రాక్టరు నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చిన్నపాటి జాగ్రత్తలతో..
వేసవి టూర్ బీ హ్యాపీ

- పర్యాటక ప్రాంతాల పర్యటనలకు ప్రణాళిక తప్పనిసరి
- గుర్తింపు కార్డులు, మెడికల్ కిట్లు వెంట తీసుకెళ్తే మంచిది
- చిన్నపిల్లల జేబుల్లో ఫోన్ నంబర్, చిరునామా స్లిప్పులు ఉంచాలి
- ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీ ముచ్చట వద్దు





రాజంపేట టౌన్ : వేసవి సెలవుల్లో విహార యాత్రలకు వెళ్లడం ఇప్పుడు సర్వసాధారణంగా మారింది. కొంత మంది కుటుంబ సభ్యులే వెళుతుంటారు. మరి కొందరు బంధు, మిత్రులతో బృందాలుగా ఏర్పడి ప్యాకేజీలు మాట్లాడుకొని సంతోషంగా గడిపేందుకు టూర్‌లకు వెళుతుంటారు. సెలవుల్లో సేద తీరడంతో పాటు కొత్త ప్రాంతాలను సందర్శించామనే తృప్తి కోసం వేసవి సెలవుల్లో చాలా మంది వివిధ ప్రాంతాలకు వెళతారు. వేసవి సెలవుల్లో ప్రధానంగా చాలా మంది సొంత గ్రామాలకు, బంధువుల ఊళ్లకు వెళ్లడం, పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వంటివి చేస్తుంటారు. అయితే ప్రయాణాలు, విహార యాత్రల్లో ఎలాంటి ఇబ్బందులు సమస్యలు లేకుండా విజయవంతమై సంతోషాన్ని, ఆనందాన్ని పొందాలంటే ప్రణాళికలు రూపొందించుకొని వాటిని అనుసరించడం చాలా అవసరం. టూర్‌లకు వెళ్లే వారు వారి వారి పరిధిలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. అప్పుడే యాత్ర ఆనందాల హారంగా మారుతుంది.

సన్నద్ధత ముఖ్యం..

- విహార యాత్రలకు వెళ్లే సమయంలో అందరిలో ఎంతో ఉత్సాహం ఉంటుంది. ఆ ఉత్సాహంలో కొన్ని సమయాల్లో చిన్నపిల్లల గురించి మరచిపోయే అవకాశం లేకపోలేదు.
- యాత్ర ప్రదేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ముందే తెలుసుకొని సమయం సద్వినియోగం అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- టూర్‌కు వెళ్లే ప్రతి ఒక్కరు ఫోటో, చిరునామాతో కూడిన గుర్తింపు కార్డు ఎప్పుడు తమ వెంట ఉంచుకొని ఉండాలి. కొన్ని సందర్భాల్లో వీటి అవసరం ఏర్పడుతుంది.
- విధిగా ప్రథమ చికిత్సకు సంబంధించిన వైద్య సామగ్రి వెంట తీసుకెళ్లాలి. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులకు సంబంధించిన మాత్రలను వెంట ఉంచుకోవాలి.
- పర్యాటక ప్రాంతాలను సందర్శించినప్పుడు వాటి చరిత్ర, అక్కడి విశేషాలను, మధురానుభూతులను డైరీలో రాసుకుంటే అవి జీవితాంతం గుర్తుండిపోతాయి.

చిన్నపాటి జాగ్రత్తలతో పర్యటనలు సుఖాంతం..

- పిల్లల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి
- కుటుంబ సభ్యులందరితో పాటు విహార యాత్రకు వెళ్లేటప్పుడు ఆ బృందంలో ఒక్కొక్కరుగా పిల్లల బాధ్యతను పంచుకోవాలి
- చిరునామా, సెల్ నెంబర్ వివరాలు ఉన్న చిన్న స్లిప్పులు పిల్లల జేబుల్లో విధిగా ఉంచాలి.
- ముఖ్యంగా నదులు, చెరువులు, కోనేర్లు ఉన్న ప్రాంతాల్లో పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- నీటి పరివాహక ప్రాంతాలు, కొండలు, లోయలు వంటి ప్రమాదకర ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఈతకొట్టడం, ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు అత్యుత్సాహం ప్రదర్శించకూడదు
- ఆహార పదార్థాల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

అత్యుత్సాహాన్ని ప్రదర్శించకూడదు



టూర్‌లకు వెళ్లినప్పుడు ముఖ్యంగా యువత అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తుంది. అత్యుత్సాహం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ప్రధానంగా ప్రమాదకరమైన ప్రాంతాలకు వెళ్లి సెల్ఫీ తీసుకోవడం వంటివి ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు. అలాగే ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రకమైన వంటలు ప్రసిద్ధి గాంచి ఉంటాయి. వాటి రుచిని ఆస్వాదించాలి. టూర్ మరో ఏడాది వచ్చే సెలవుల వరకు ఓ తియ్యటి జ్ఞాపకంలా ఉండాలి. – మోహనవల్లి, ప్రభుత్వ అధ్యాపకురాలు, మదనపల్లె

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లి : బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ గొర్ల ఉమాదేవి పేర్కొన్నారు. కిశోరి వికాసం వేసవి క్యాలెండర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ సభా భవనంలో ఆమె సీడీపీఓ పద్మావతి, అంగన్ వాడీ టీచర్లు, సూపర్ వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటరీ ప్యాడ్స్‌లో కాటన్ క్లాత్‌లు వాడుతున్న వారు వాటిని శుభ్రంగా ఉతికి ఎండలో ఆరబెట్టి పూర్తిగా ఆరిన తరువాత మాత్రమే వాడాలన్నారు. అలాగే వాటిని ఒకటి లేదా రెండు సార్లు కంటే ఎక్కువ వాడకపోవడం మంచిదన్నారు.

మా భూమిని మాకు ఇప్పించండి

రాయచోటి టౌన్ : తన తండ్రి నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని తమకు ఇప్పించాలని సుండుపల్లె మండలం పొలిమేరపల్లెకు చెందిన మద్దెల కొండయ్య, ఆయన కుమారుడు వీరనాగయ్య, ఆయన భార్యలిద్దరు అన్నమయ్యజిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రం అందించారు. ఆ భూమిని మద్దెల రెడ్డెయ్య తండ్రి మద్దెల రామయ్య పేరుతో రికార్డులు తారు మారు చేశారని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడి


గాయపడిన బాలాజీ

నిమ్మనపల్లె : గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి మండలంలో జరిగింది. స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు... రాయచోటి మండలం అబ్బవరం పంచాయతీ, ఇందుకూరుపల్లికి చెందిన ఆటో డ్రైవర్ బాలాజీ (35)కి, నిమ్మనపల్లి మండలం బండ్లపై గ్రామానికి చెందిన ఉషారాణితో వివాహమైంది. భార్య సూచనతో 15 రోజుల క్రితం బండ్లపై కి వచ్చాడు. సోమవారం రాత్రి బాలాజీ భార్య ఉషారాణి తో కలిసి ఊరికి సమీపంలో ఉండగా, కొంతమంది వ్యక్తులు అకస్మాత్తుగా బాలాజీపై రాళ్లతో, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడిని కుటుంబ సభ్యులు మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తల్లి రామక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య


చలపతి (ఫైల్)

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో భవన నిర్మాణ కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మదనపల్లెలో వెలుగుచూసింది. పెద్దమండ్యం మండలం చెరువుకిందపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు చలపతి(41), భవననిర్మాణ కార్మికుడుగా పనిచేసేవాడు. అతనికి భార్య గంగరాణి, ఇద్దరు సంతానం ఉన్నారు. రూ.4లక్షలు అప్పుచేసి ఇల్లు నిర్మించుకున్నాడు. అప్పులు తీర్చడం కష్టమవడంతో భార్యాపిల్లలతో కలిసి మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు వచ్చి స్థానికంగా పనులు చేస్తున్నాడు. 20 రోజుల క్రితం కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్య గంగరాణితో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆమె బంధువులు, కుటుంబ సభ్యులతో భర్తను వెతకడం ప్రారంభించినా ఆచూకీ లభించలేదు. తనే తిరిగి ఇంటికి వస్తాడని భావించి మిన్నకుండిపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ నీరుగట్టువారిపల్లె సమీపంలోని కాట్లాటపల్లె రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి, గుర్తుపట్టలేని విధంగా దుర్వాసన వస్తుండటంతో స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి ఆచూకీ తెలుసుకుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

బండి కనుమ వద్ద త్రుటిలో తప్పిన ప్రమాదం


సిద్దవటం మండలంలోని బండికనుమ వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న ఐచర్ వాహనం

సిద్దవటం : కడప– మాచుపల్లె రహదారిలోని బండికనుమ మలుపు వద్ద పెను ప్రమాదం తప్పింది. మంగళవారం హిందూపురం నుంచి బద్వేల్‌కు చింతపండు రవాణా చేస్తున్న ఐచర్ వాహనం బండికనుమ మలుపు వద్దకు రాగానే లింగంపల్లె గ్రామం నుంచి కడపకు వెళుతున్న ఆటోను తప్పించబోయి కల్వర్టును ఢీకొంది. వాహనం రహదారికి అడ్డంగా ఉండటంతో మాచుపల్లె, టక్కోలు, లింగంపల్లె, కడపాయపల్లె ఖాజీపల్లె, డేగనవాండ్లపల్లె గ్రామాల నుంచి కడపకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. బండికనుమ రహదారిలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో పాటు మలుపు కూడా ఉండటంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రాంతంలో రక్షణ గోడ కూడా దెబ్బతినడంతో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు లోయలో పడే ప్రమాదం ఉంది. రహదారికి అడ్డంగా ఉన్న ఐచర్ వాహనాన్ని స్థానికులు జేసీబీ యంత్రంతో తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి. ఇప్పటికైనా ప్రమాదాలను అరికట్టేందుకు రహదారి విస్తరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఖాళీ జాగా..వేసేయ్ పాగా.!


వినాయక చేనేత నగర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు జేసీబీతో చదును చేసిన దృశ్యం

కురబలకోట : కురబలకోట మండలంలో ఖాళీ స్థలం కన్పిస్తే కబ్జాకు యత్నిస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలన్న చందంగా అధికారం ఉండగానే సంపాదించుకోవాలన్న ఆశతో కొందరు కూటమి నాయకులు ఖాళీ జాగాలపై కన్నేస్తున్నారు. చూసెయ్ జాగా.. వేసేయ్ పాగా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా కురబలకోట మండలంలోని వినాయక చేనేత నగర్‌లో సర్వే నెంబరు 633/11లో ప్రభుత్వ భూమిని మదనపల్లె పట్టణానికి చెందిన కూటమి నాయకులు కొందరు రెండు రోజుల క్రితం జేసీబీలతో ఐదు కుంటల స్థలాన్ని చదును చేశారు. అధికారం ఉంది కదా అని దర్జాగా కబ్జాకు యత్నించారు. విలువైన భూమి కబ్జా విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు వచ్చి పరిశీలించారు. ఇది ప్రభుత్వ భూమియని ఎవ్వరికీ ఇంటి పట్టాలు ఇవ్వలేదని నిర్ధారించారు. దీంతో పనులను నిలిపి వేయించారు. రికార్డులు ఉంటే చూపాలని ఆదేశించారు. వస్తామన్న వారు పత్తా లేకుండా పోయారు. సదరు భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు తపస్విని, ఎంఆర్ఐ బాలసుబ్రమణ్యం బుధవారం తెలిపారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి


మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఈఆర్ చంద్ర

రాయచోటి : రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో రాజంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ ఈఆర్ చంద్ర (43) గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం ఉదయం రాజంపేట నుంచి బయలు దేరిన ఆర్టీసీ బస్సు 7.45 గంటలకు రాయచోటి బస్టాండ్‌కు చేరుకుంది. బస్సును బస్టాండ్ పాయింట్‌లో పెట్టి కండక్టర్ శ్రీధర్‌తో కలిసి టిఫిన్ తిన్న అనంతరం నీరు పట్టుకోవడానికి సెకండ్ ఫ్లోర్‌లోకి వెళ్లిన డ్రైవర్ అక్కడే గుండెపోటుతో మృతి చెందినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు హుటాహుటిన సీఆర్ చేసి ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. సంఘటనపై పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ, ఎంప్లాయిస్ యూనియన్ లీడర్లు జీఎం రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

సోలార్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

గాలివీడు : తూముకుంట సోలార్ నిర్వాసితులకు సముచిత న్యాయం చేస్తామని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం సభా భవనంలో ఆర్డీఓ శ్రీనివాసులుతో కలసి తూముకుంట సోలార్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 మెగావాట్ల అదనపు సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం భూసేకరణలో భాగంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, అర్హులైన వారికి అసైన్‌మెంట్ భూమి ఇప్పించేలా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎకరాకు రూ.6 లక్షలు రూపాయలు చెల్లించాలని రైతులు జేసీని కోరారు. ఎకరాకు రూ.3.30 లక్షలు మాత్రమే ఇవ్వగలమన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎకరాకు రూ.3.60 లక్షలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సోలార్ డీఈ శివశంకర్ నాయుడు, తహసీల్దార్ భవానీ, ఆర్.ఐ బాలాజీ, సోలార్ రైతులు పాల్గొన్నారు.

దాతల సాయంతో అంత్యక్రియలు


తల్లి మృతదేహంపై పసికందు మృతదేహం

కలకడ : భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న చిన్నారి(20) అనే యువతి అంత్యక్రియలు మంగళవారం దాతల సాయంతో నిర్వహించారు. సోమవారం ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కాగా ఆమె మృతి చెందే సమయానికి ఎనిమిది నెలల గర్భిణి కావడంతో పోస్టుమార్టం సమయంలో శిశువును బయటకు తీశారు. మృతురాలికి తల్లిదండ్రులు లేకపోవడంతో స్థానికుల సాయంతో మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ స్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి మృతదేహంపై, పసికందు మృతదేహం చూసినవారు కంట తడిపెట్టారు.

'ముత్తూట్'లో మాయాజాలం

బి.కొత్తకోట : స్థానిక రంగసముద్రం రోడ్డులోని ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచీలో రూ.65.76 లక్షలు జమచేయని ముగ్గురు ఉద్యోగులపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు. బి.కొత్తకోటకు చెందిన ఇమ్రాన్ బాషా, జె.హరీష్, ఎం.హరికృష్ణలు ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచిలో పనిచేస్తున్నారని తెలిపారు. వీరు బంగారు ఆభరణాలకు సంబంధించి ఖాతాదారుల నుంచి డబ్బు తీసుకుని బ్యాంకులో జమ చేయలేదని తేలింది. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా రూ.65.76లక్షలు వాడుకున్నారని ముత్తూట్ ఫైనాన్స్ రీజనల్ మేనేజర్ ఎస్.దేవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని కురవంకకు చెందిన వీరబ్రహ్మేశ్వరరావు కుమారుడు వి.వి.ఎస్.రాఘవేంద్ర వ్యాసకుమార్(44) ఈనెల 1న వ్యక్తిగత పనులపై చిత్తూరు వెళ్లాడు. అక్కడే అతడి భార్య నర్సుగా పనిచేస్తోంది. అదేరోజు కుటుంబ సమస్యలతో చిత్తూరులో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు భార్యకు ఫోన్‌చేశాడు. ఆమె స్థానికుల సహాయంతో బాధితుడిని వేలూరు సీఎంసీ వైద్యశాలకు తీసుకెళ్లగా, అక్కడ అడ్మిషన్ చేసుకోకపోవడంతో మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం వి.వి.ఎస్.రాఘవేంద్ర వ్యాసకుమార్ మృతి చెందాడు. అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది చిత్తూరు పోలీసులకు సమాచారం అందించారు.

డీఎస్పీని రక్షణ కోరిన ప్రేమ జంట


రక్షణ కల్పించాలని డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ప్రేమజంట

మదనపల్లె : కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందంటూ ఓ ప్రేమ జంట మంగళవారం డీఎస్పీ మహేంద్రను ఆశ్రయించి, రక్షణ కోరుతూ వినతి చేశారు. తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లి పంచాయతీ దండువారిపల్లెకు చెందిన వెంకటరమణ రెడ్డమ్మ దంపతుల కుమారుడు సుదర్శన్ (30)కు చిత్తూరు జిల్లా సోమల మండలం గట్టువారిపల్లె పంచాయతీ గురికానివారిపల్లెకు చెందిన మహేశ్వర, పుష్పవతి దంపతుల కుమార్తె చైత్ర (19)తో 2024 డిసెంబర్ లో పెళ్లి చూపులు జరిగాయి. మొదట రెండు కుటుంబాలు అంగీకరించినా, చైత్ర మేనమామ సూచనతో పెళ్లి సంబంధాన్ని నిరాకరించారు. అయితే అప్పటికే ఒకరినొకరు ఇష్టపడ్డ సుదర్శన్, చైత్ర నాలుగు నెలల పాటు వేచి చూశారు. పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో, సోమవారం ఇంట్లో నుంచి పారిపోయి పుంగనూరు వద్ద శివాలయంలో వివాహం చేసుకున్నారు. చైత్ర తన కుటుంబ సభ్యుల నుంచి ఇబ్బందులు ఎదురవుతాయని భావించి మంగళవారం మదనపల్లి డీఎస్పీ కార్యాలయం చేరుకుని, తాము ఇష్టపూర్వకంగా వివాహం చేసుకున్నామని, తమకు రక్షణ కల్పించాలని వినతి చేశారు.

జల గండం.. జరభద్రం

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

ములకలచెరువు మండలం దండువారిపల్లె గుట్టకాలనీలో నీటికుంటలో పడి నలుగురు మృత్యువాత పడ్డారు. చిట్వేలి మండలం ఎం.రాచపల్లిలో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. గాలివీడు మండలం తూముకుంట వద్ద చెరువులో దిగిన ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు మృతి చెందారు. వెలిగల్లు జలాశయం వద్ద రెండేళ్ల క్రితం మదనపల్లె, కర్నాటక ప్రాంతానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు.

- ఈతకు వెళ్తూ మృత్యువాత పడుతున్న చిన్నారులు
- అధికారులు, తల్లిదండ్రులు అప్రమత్తమైతే మేలు



మదనపల్లె సిటీ : పిల్లలెవరికైనా నీరంటే చాలా ఇష్టం. వేసవి ఎండ నేపథ్యంలో నీటిలో ఆడటమంటే వారికి ఎక్కడ లేని ఆనందం. అందుకే ఒంటిపూట బడులు నడిచేటప్పుడు, వేసవి సెలవుల్లో సరదాగా బావులు, కుంటలు, వాగులు, చెరువుల వద్దకు స్నేహితులతో కలిసి వెళ్తుంటారు. ఇందులో కొందరు ఈత కొడతారు, మరి కొందరు ఈత రాక పోయినా సరదాగా కుంట అంచున నీటిలోకి దిగి ఆడుతుంటారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతున్నారు. సమయానికి అక్కడ పెద్దవాళ్లు ఎవరూ ఉండకపోవడంతో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా ఇలా జరుగుతున్నా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవటం లేదు. జిల్లాలో చెరువులు, కుంటలలో నీళ్లు ఉన్నాయి. వాటి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేవు. ముఖ్యంగా చెరువుల్లో భారీ గుంతలు ఉన్నాయి. వాటిలో నిండా నీరు ఉండటంతో పైనుంచి దూకుతున్నారు. అడుగున ఉన్న రాళ్లు తలకు తాకి ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిలో ఈత ప్రమాదమని బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎక్కడా కన్పించడం లేదు. రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏటా వేసవిలో నీటి ప్రమాదాల నివారణపై రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గ్రామస్థాయిలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలి. తల్లిదండ్రులు, పిల్లలను అప్రమత్తం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రమాదకర బావుల వద్ద అధికారులు హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వేసవి సెలవులు నడుస్తున్నాయి. జిల్లాలో బాహుదా, పింఛా, మాండవ్య, ఝరికోన, చెయ్యేరు, వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిలో గుంతలు ఏర్పడటంతో ప్రమాదకరంగా మారాయి. పిల్లలను నీటి కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్త తీసుకోవాలి.

ఈత వచ్చినవారు తప్పనిసరి..



ఈత నేర్చుకునేందుకు బావులు, చెరువులు, కుంటల కంటే స్విమ్మింగ్‌పూల్ సురక్షిత ప్రదేశం, స్విమ్మింగ్‌పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వచ్చే పిల్లలను కోచ్ ఓ కంట కనిపెట్టుకొని చూస్తుంటారు. మరో వైపు తల్లిదండ్రులు కూడా పిల్లలను పర్యవేక్షించాలి. ఏడేళ్లకు పైబడిన చిన్నారులకే ఈత నేర్పిస్తారు. కాళ్లు, చేతులకు కట్టే లైఫ్ ప్యాడ్లు, హెడ్‌క్యాప్, లైఫ్ జాకెట్, ట్యూబు నీటిలో మునగకుండా ఉపయోగపడతాయి. చెరువులు, బావుల్లో ఎలాంటి భద్రతా చర్యలు ఉండవు. లోతు తెలియకుండా చిన్నారులు దూకేస్తుంటారు. రేకుడబ్బాలు, తేలియాడే కర్రల మోపు వీపున కట్టుకోవడం అంత సురక్షితం కాదు. పల్లెల్లో ఈత నేర్చుకునేందుకు పిల్లలను ఇతరులతో పంపించొద్దు. ఈత వచ్చిన కుటుంబ సభ్యులు తప్పనిసరిగా వెంట ఉండాలి. – ప్రసాద్‌రెడ్డి, పీడీ, ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, మదనపల్లె.